సాక్షి
విజయనగరం
మంగళవారం । 16 । ఏప్రిల్ । 2024



అకట్టుకోని పురాణం అతకని అబద్ధం - 8లో
ఎన్నికల వేళ అబద్ధాలు చెప్పడం కళావెం కటరావుకు అలవాటు. ప్రస్తుం ఆయన అబద్ధాల పురాణం ఆకట్టుకోలేకపోతోంది.



సొసైటీ భూముల పేరిట రాజకీయం సిగ్గుచేటు
నగరంలోని డబుల్‌కాలనీని ఆనుకుని ఉన్న 18 ఎకరాల భూమి సొసైటీ సభ్యులదేనని తేలింది. - 8లో



అత్యవసర సేవల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్
అత్యవసర సేవలందిస్తున్న ఉద్యోగులు, ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌ను అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

మాతా, శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: మాతా, శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆశ నోడల అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతాశిశు ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. వైద్యసేవలతో పాటు పౌష్టికాహారం అందిస్తోందని చెప్పారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి ప్రసవం కోసం ఆస్పత్రిలో చేరేలా చూడాలన్నారు. రక్తహీనతతో బాధపడే గర్భిణులకు పీహెచ్‌సీల్లో ఐరన్ సుక్రోజ్ వ్యాక్సిన్లు వేయాలన్నారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ ఆర్.అచ్యుతకుమారి, డీపీహెచ్‌ఎన్‌ఓ మామిడి సత్యవతి, మహాలక్ష్మి, రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

శ్లాస్ పరీక్షకు సర్వం సిద్ధం



ఎస్.ప్రేమకుమార్, డీఈఓ

విజయనగరం అర్బన్: స్టేట్ లెర్నింగ్ అచీవమెంట్ సర్వే (శ్లాస్) పరీక్ష మంగళవారం జరగనుంది. దీనికి జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తిచేసినట్టు డీఈఓ ఎస్.ప్రేమకుమార్ తెలిపారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడమే శ్లాస్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఇప్పటికే ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు మండల కార్యాలయాలకు చేరాయన్నారు. ఆయా మండలాల్లో కేటాయించిన పాఠశాలల్లో సీఆర్పీలు ఈ సర్వే పరీక్ష నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని వంగర మండలం మినహా 26 మండలాల పరిధిలోని 129 ప్రభుత్వ, వివిధ యాజమాన్య పాఠశాలల్లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శ్లాస్ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు.

ఏబీపీపీ జిల్లా అధ్యక్షుడిగా రమణ



ఉరిటి రమణ

చీపురుపల్లి: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ విజయనగరం జిల్లా అధ్యక్షునిగా పట్టణానికి చెందిన ఉరిటి రమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర ప్రచార సభ జిల్లా సర్వసభ్య సమావేశం సోమవారం రాజాంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ కార్యదర్శి ఎస్.రుద్రకోటేశ్వరరావు ఆధ్వర్యంలో 2024-26 సంవత్సరానికి సంబంధించి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన రమణ మాజీ అధ్యక్షుడు పి.రాము నుంచి బాధ్యతలు స్వీకరించారు. అయ్యప్పస్వాముల సంక్షేమానికి కృషి చేస్తానని రమణ తెలిపారు.

18 నుంచి నామినేషన్ల స్వీకరణ



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 18వ తేదీన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని, తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్వోలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన ఆర్వోల సమావేశంలో ఆమె మాట్లాడారు. 18న ఎన్నికలకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని, ఆ రోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. నామినేషన్ల దాఖలకు చివరి తేదీ ఈ నెల 25వ తేదీకాగా, 26న నామినేషన్లను పరిశీలన, 29న ఉపసంహరణ, మే 13వ తేదీ పోలింగ్ జరుగుతుందని తెలిపారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. నామినేషన్ల స్వీకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలను వివరించారు. అభ్యర్థులు నామినేషన్ల దాఖలకు 13 రకాల డాక్యుమెంట్లను తీసుకురావాలని, అన్ని రకాల డాక్యుమెంట్లు సక్రమంగా ఉంటే నామినేషన్లను అనుమతిస్తామన్నారు. చివరి రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామని చెప్పారు. పబ్లిక్ సెలవు దినాల్లో నామినేషన్లు స్వీకరించబడవన్నారు. అభ్యర్థులు గరిష్ఠంగా 4 సెట్ల నామినేషన్ దాఖలు చేయవచ్చన్నారు. నామినేషన్లు దాఖలు సమయంలో గరిష్ఠంగా 3 వాహనాలు అనుమతించబడతాయని, 5 మంది వ్యక్తులు (అభ్యర్థితో సహా) ఆర్ఓ ఆఫీస్‌లోకి వెళ్లవచ్చన్నారు. సమావేశంలో జేసీ కె.కార్తీక్, డీఆర్ఓ ఎస్.డి.అనిత, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు సందీప్‌కుమార్, సుధారాణి, ఆర్వోలు పాల్గొన్నారు.

కూటమి కుట్రలను తిప్పికొట్టి..

వలంటీర్ల రాజీలేని పోరాటం

వలంటీర్లు.. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు. సమాజ సేవకులు. సుమారు 58 నెలలపాటు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేర్చారు. కోవిడ్ సమయంలో ప్రజలకు అండగా నిలిచి అందరి ప్రశంసలు అందుకున్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చారు. వీరి సేవలపై చంద్రబాబు అండ్ కో తప్పుడు వ్యాఖ్యలు చేయడం, ఎన్నికల వేళ సేవలకు అభ్యంతరం చెప్పడంతో మనస్తాపం చెందారు. మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నారు. సేవకులుగా ఎదిగేందుకు అవకాశం కల్పించిన నాయకులకు మద్దతుగా అడుగులు వేస్తున్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని వలంటీర్ వ్యవస్థను బతికించుకునేందుకు రాజీలేని పోరాటం చేస్తున్నారు.

- పథకం ప్రకారం దాడికి 'ఎల్లో బ్యాచ్' విశ్వప్రయత్నాలు
- ఇప్పటికే ప్రభుత్వ పథకాల్లో జోక్యాన్ని అడ్డుకున్న వైనం
- తిప్పికొడుతున్న సేవా వారధులు
- తమకు సమాజంలో గౌరవమిచ్చిన జగనన్నకు రుణపడి ఉంటామని వెల్లడి
- స్వచ్ఛందంగా ఉద్యోగాలకు రాజీనామా
- ప్రజాసంక్షేమ, అభివృద్ధి పాలనకు మద్దతు
- వలంటీర్ వ్యవస్థను బతికించుకునే దిశగా ముందుకు...



రాజీనామా పత్రాలు చూపిస్తున్న గంట్యాడ మండలం నరవ గ్రామ వలంటీర్లు



పూసపాటిరేగ: సీహెచ్ అగ్రహారం సచివాలయంలో కార్యదర్శి జ్యోతికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

విజయనగరం అర్బన్:

సేవాదృక్పథంతో పని చేస్తున్న వలంటీర్లపై 'ఎల్లో' బ్యాచ్ దాడులు ఆగడం లేదు. రాజకీయ ప్రచారంలో పాల్గొంటున్నారని ఓ సారి.. అధికార పార్టీకి అనుకూలంగా పని చేస్తున్నారని మరోసారి.. పథకాలు పంపిణీ చేస్తూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని ఇంకోసారి రకరకాలుగా వేధిస్తూ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. అక్కసు వెళ్లగక్కుతున్నారు. వారిని సంఘ విద్రోహులుగా ఓవైపు దూషిస్తూనే.. మరోవైపు తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామంటూ మభ్యపెడుతున్నారు. ప్రతినెలా ఠంచన్‌గా పింఛన్ పంపిణీ చేస్తూ అవ్వాతాతల కళ్లలో వెలుగులు నింపిన వలంటీర్లను ఈ నెలలో ఆ విధుల నుంచి అడ్డుకున్నారు. ఎన్నికల కోడ్ మొదలుకుని ప్రభుత్వపరంగా వారి సేవలను ప్రజలకు దూరం చేశారు. రూ.5 వేల గౌరవ వేతనంతో తమ పరిధిలోని 50 ఇళ్ల మధ్య గౌరవంగా బతికే వలంటీర్లను పూర్తిగా విధుల నుంచి తొలగించే కుట్రలను 'పచ్చ' కూటమి అమలు చేస్తోంది. తమకు ఉపాధి కల్పించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో చాలామంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తుంటే.. గ్రామాలంటూ, ముసుగు తీస్తున్నారంటూ వారిని మానసికంగా ఎల్లో మీడియా ద్వారా వేధింపులకు గురి చేస్తున్నారు. చివరికి ఎక్కడ సమావేశాలైనా అందులో వలంటీర్లు పాల్గొన్నారంటూ దుష్ప్రచారానికి దిగుతున్నారు. మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. ఇవన్నీ గమనిస్తే వలంటీర్ల వ్యవస్థను పూర్తిగా కనుమరుగు చేసేందుకు పథకం ప్రకారం 'పచ్చదండు' యత్నిస్తోందన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్న వలంటీర్లు

తమకు సమాజంలో గౌరవమైన జీవితాన్ని ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌కు.. తమ వల్ల మాట రాకూడదన్న ఉద్దేశంతో వలంటీర్లు స్వచ్ఛంద రాజీనామాకు సిద్ధపడుతున్నారు. రాజీనామా చేసి నేరుగా ప్రభుత్వానికి అండగా నిలుస్తామని, మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకుని సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగిస్తామని, వలంటీర్ వ్యవస్థను రక్షించుకుంటామని ఘంటాపథంగా చెబుతున్నారు. కొద్దిరోజులుగా జిల్లాలో వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్న విషయం విదితమే. జిల్లాలో ఇంతవరకు 1,288 మంది వలంటీర్లు రాజీనామా చేయగా, సోమవారం ఒక్కరోజే 527 మంది రాజీనామా చేశారు.

అత్యధికంగా నెల్లిమర్లలో 587 మంది...

జిల్లా వ్యాప్తంగా పెరుగుతున్న వలంటీర్ల రాజీనామాల్లో నెల్లిమర్ల నియోజకవర్గం ముందువరసలో ఉంది. ఇంతవరకు 587 మంది రాజీనామా చేశారు. ఇందులో సోమవారం ఒక్కరోజున రాజీనామా చేసిన వారు 307 మంది ఉన్నారు. ఓ సరికొత్త వ్యవస్థను తీసుకొచ్చి... సేవల విప్లవాన్ని సృష్టించిన వలంటీర్ వ్యవస్థపై ఎల్లోబ్యాచ్ చేస్తున్న తప్పుడు వ్యాఖ్యలను, ఫిర్యాదులను తిప్పికొట్టి.. రాజీనామాలతో జగనన్న సంక్షేమ పాలనకు మద్దతు పలుకుతున్నారు. నాయకుడికి అవసరమైనప్పుడు అండగా నిలవలేని ఉద్యోగం ఎందుకంటూ వదులుకుంటున్నారు.

నియోజకవర్గాల వారీగా వలంటీర్ల రాజీనామా ఇలా..:

నియోజకవర్గాలు	ఆదివారం వరకు	సోమవారం	మొత్తం
బొబ్బిలి	59	70	129
చీపురుపల్లి	13	18	31
గజపతినగరం	182	19	201
నెల్లిమర్ల	280	307	587
రాజాం	95	25	120
ఎస్.కోట	73	88	161
విజయనగరం	41	0	41
సాలూరు (మెంటాడ)	18	0	18
మొత్తం	761	527	1,288

ప్రతిపక్షం తీరు దారుణం



ఎన్నికల వేళ.. ప్రతిపక్షం పన్నిన కుట్ర వల్ల సేవలకు దూరం కావాల్సి వచ్చింది. పింఛన్ల కోసం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు అడుగుతుంటే బాధకలిగింది. అవసోపాలు పడి సచివాలయానికి వెళ్లి తీసుకున్నారు. వలంటీర్ వ్యవస్థను నాశనం చేసేందుకు ప్రతిపక్షం కుట్రపన్నింది. తప్పుడు వ్యాఖ్యలు చేస్తోంది. వీటిని తిప్పికొట్టి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేశాను. జగనన్న ప్రభుత్వం ఏర్పాటుకు కష్టపడి పనిచేస్తాను.

– గొంప ఉమ, రామలింగాపురం, కొత్తవలస మండలం

నన్ను టార్గెట్ చేశారు



జగన్ మోహన్‌రెడ్డి అందుబాటులోకి తెచ్చిన వలంటీర్ వ్యవస్థతో 50 ఇళ్లకు సేవచేసే అవకాశం దొరికింది. ఎన్నికల వేళ చంద్రబాబు అండ్ కో ఇచ్చిన ఫిర్యాదులతో సేవలకు దూరమయ్యాను. తమకు ఉపాధి కల్పించిన నాయకుడికి మద్దతుగా ఉంటే కేసులు పెడుతున్నారు. అందుకే.. వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేశాను. జగనన్నను రెండోసారి సీఎంను చేసుకునేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటువేయాలని ప్రచారం చేస్తున్నాను. ఆయన మళ్లీ సీఎం అయితేనే వలంటీర్ వ్యవస్థ బతుకుతుంది. ప్రజలకు ఇళ్లవద్దే సేవలందుతాయి.

– గదిడి భీమేశ్వరరావు, పోరలి గ్రామం, దత్తిరాజేరు మండలం

సేవలకులపై ఆరోపణలు చేయడం తగదు



మాది వేపాడ మండలం వావిలపాడు గ్రామం. సంప్రదాయక కుటుంబం. సీఎమ్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ప్రజలకు సేవలందించే అవకాశం కలిగింది. ఆనందంగా పనిచేశాను. వలంటీర్ల సేవలను చంద్రబాబు, అండ్‌కో అనుమానిస్తున్నారు. తప్పుడు ఫిర్యాదులు, వ్యాఖ్యలు చేస్తున్నారు. దీనికి మనస్తాపం చెంది వలంటీర్ పదవికి రాజీనామా చేశాను. రెండునెలల్లో మరల మన ప్రభుత్వం వస్తుందని, సేవలందిస్తానని తమ పరిధిలోని 50 కుటుంబాలకు చెబుతున్నాను. ధైర్యం కల్పిస్తున్నాను.

– దొడ్డి మాణిక్యం, వావిలపాడు, వేపాడ మండలం

రామతీర్థానికి కోటి తలంబ్రాలు



ఈఓ శ్రీనివాసరావుకు పవిత్ర తలంబ్రాలను అందజేస్తున్న సేవా సంఘం ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానానికి గోటితో సిద్ధం చేసిన కోటి తలంబ్రాలు సోమవారం చేరుకున్నాయి. ఈ నెల 17న శ్రీరామనవమి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని రామతీర్థం సేవా సంఘం ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన రామభక్తులు గడిచిన నెలరోజుల నుంచి ప్రత్యేకంగా సేద్యం చేసిన ధాన్యాన్ని గోటితో ఒలిచి తలంబ్రాలుగా సిద్ధం చేశారు. సిద్ధమైన కోటి తలంబ్రాలను కళశాలలో వేసి రామతీర్థం దేవస్థానానికి తీసుకువచ్చారు. భక్తులు శ్రీరామ నామాన్ని స్మరిస్తూ రామతీర్థం తిరువీధుల్లో పవిత్ర తలంబ్రాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. రామ దేవస్థానానికి చేరుకున్న భక్తులకు ఈఓ శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి ధృవమూర్తుల వద్ద తలంబ్రాలను ఉంచి ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు భద్రపరిచారు. కార్యక్రమంలో సేవా సంఘం ప్రతినిధులు రేగాన గోవిందరావు, సుదర్శన విజయ్‌కుమార్, ఆల్తి శ్రీనివాసరావు, అర్చకులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మిగులు సీట్లకు కౌన్సెలింగ్

- 18న బాలురు, 19న బాలికల గురుకులాలకు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని పాఠశాలల్లో 5వ తరగతి మిగులు సీట్లకు కౌన్సెలింగ్ తేదీలను ఆ సంస్థ ఉమ్మడి విజయనగరం జిల్లా సమన్వయకర్త టి.పద్మజ ప్రకటించారు. 2024-25 విద్యాసంవత్సర ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షల్లో మెరిట్ సాధించిన వారికి కౌన్సెలింగ్ చేపడతామన్నారు. కొప్పెర్ల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాలలో ఈ నెల 18న , చీపురుపల్లి డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఈ నెల 19న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రాతిపదికన నిర్వహించే కౌన్సెలింగ్‌కు మెరిట్ జాబితాలో ఉన్న విద్యార్థుల మొబైల్ ఫోన్‌కు సమాచారం అందజేశామన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభించే కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు ఉదయం 9 గంటలకే హాజరుకావాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం బాలికలు 83330 33434, బాలురు 63038 38657 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

చిత్తశుద్ధితో ఎన్నికల విధులు





హాజరైన సిబ్బంది, శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

- ఉదయం 5.30 గంటలకే మాక్ పోలింగ్
- పీఓలు అత్యంత కీలకంగా వ్యవహరించాలి
- శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

చీపురుపల్లి: ఎన్నికల్లో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ రీ పోలింగ్‌కు అవకాశం లేకుండా చిత్తశుద్ధితో ఎన్నికల విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. గరివిడిలో ఎస్‌డీఎస్ అటానమస్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి సోమవారం నిర్వహించిన రెండో విడత శిక్షణను ఆమె పరిశీలించారు. ఎన్నికల్లో పీఓల బాధ్యతలు అత్యంత కీలకమని చెప్పారు. మే 13న పోలింగ్ రోజున ఉదయం 5 గంటలకే పోలింగ్ బూత్‌లో పూర్తిఏర్పాట్లు చేసుకుని 5.30 గంటలకే మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. అనంతరం వీవీ ప్యాట్‌లను ఖాళీ చేసి, ఈవీఎంలను రీసెట్ చేయాలన్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాలని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను పీఓలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. పోలింగ్ ఏజెంట్లుగా వలంటీర్లు ఉండకూడదని, రాజీనామా చేసిన వలంటీర్లకు సంబంధించి బీఎల్ఓ, లేదా ఎంపీడీఓ ధ్రువీకరించిన తరువాత ఏజెంట్లుగా పెట్టుకోవచ్చని స్పష్టం చేశారు. సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు మెంబర్, కౌన్సిలర్, కార్పొరేటర్లు కూడా పోలింగ్ ఏజెంట్లుగా ఉండవచ్చన్నారు. ఎన్నికల సిబ్బందికి మూడో విడత శిక్షణను మే మొదటి వారంలో నిర్వహిస్తామని చెప్పారు.



వంగర: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, స్థానిక నాయకులు



విజయనగరం పూల్‌బాగ్ వ్యాసన్నారాయణ మెట్ట ప్రాంతంలో అభిమానితో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



బొబ్బిలి ఇందిరమ్మ కాలనీలో శంబంగి వెంకట చిన అప్పలనాయుడుకు స్వాగతం పలుకుతున్న కాలనీవాసులు

ఇంటింటా 'సంక్షేమ' ప్రచారం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు సోమవారం ఇంటింటా ప్రచారం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 58 నెలల సంక్షేమ, అభివృద్ధి పాలనను వివరించారు. వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఆర్థిక లబ్ధి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు చేర్చిన తీరును తెలియజేశారు. విద్య, వైద్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరించారు. ఇంటివద్దకే ప్రభుత్వ సేవలను చేరువచేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థల గొప్పతనాన్ని తెలియజేశారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుకు ఓటేసి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



పూసపాటిరేగ: బత్తివలసలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు హారతి ఇస్తున్న మహిళలు



ఎస్.కోట: పుణ్యగిరిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి



రాజారావు మృతదేహం

శృంగవరపుకోట: మండలంలోని ముషిడిపల్లి గ్రామం వద్ద తాటిచెట్టుపై నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. సోమవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పూసపాటిరేగ మండలం కుమిలి పంచాయతీ శివారు రెల్లివలస గ్రామానికి చెందిన కిలాన రాజారావు(38) ఎస్.కోట మండలంలో ఉన్న స్వప్నలోక్ లేఔట్‌లో మూడు నెలలుగా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం తాటికాయల కోసం చెట్టెక్కి కళ్లు తిరిగి కిందపడిపోయాడని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. స్థానికులు హుటాహుటిన రాజారావును ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు ఎస్.కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి ముగ్గురికి గాయాలు



గాయపడిన యువకులు

కురుపాం: మండలంలోని పెల్లివలస గ్రామ సమీపంలో సోమవారం బైక్ అదుపుతప్పడంతో జరిగిన ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలంలోని పీటీ మండ గ్రామానికి చెందిన గుంపస్వామి, దిలీప్, వేణులు బైక్‌పై కురుపాం మండలంలోని పెల్లివలస గ్రామంలో ఓ శుభకార్యానికి వస్తుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో కింద పడిపోయి తీవ్రగాయాల పాలయ్యారు. వెంటనే స్థానికులు కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి వారిని తరలించగా ప్రథమ చికిత్స అందించిన వైద్యసిబ్బంది మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కురుపాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కామాక్షినగర్‌లో చోరీ

విజయనగరం క్రైమ్: స్థానిక కామాక్షినగర్‌లోని ఓ ఇంట్లో దొంగలు చొరబడి బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారు ఆభరణాలు పట్టుకుపోయారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామాక్షినగర్‌లో నివాసం ఉంటున్న పతివాడ వెంకటరమణ తల్లి గజపతినగరంలో ఇటీవల మరణించడంతో చేపట్టాల్సిన కార్యక్రమాల నిమిత్తం ఈ నెల 13న ఆయన కుటుంబంతో కలిసి వెళ్లాడు. అయితే సోమవారం ఉదయం కామాక్షినగర్‌లోని ఆయన పక్కింటి వారు ఫోన్‌చేసి, ఇంటి తాళాలు, తలుపులు పగులగొట్టి ఉన్నట్లు చెప్పగా హుటాహుటిన వచ్చి ఇంట్లో పరిశీలించి బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారు ఆభరణాలు దొంగలు పట్టుకుపోయినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంఘటనాస్థలానికి వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి ఆధారాలు సేకరించింది. ఎస్సై తారకేశ్వరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీతారాముని కల్యాణానికి ముహూర్తపురాట



మక్కువ సాయిరామలింగేశ్వరాలయం ఎదుట పూజలు నిర్వహిస్తున్న రంగునాయుడు దంపతులు

మక్కువ: శ్రీరామనవమి పండగను పురస్కరించుకుని, సీతారాముని కల్యాణానికి స్థానిక సాయిరామలింగేశ్వరాలయంలో సోమవారం ముహూర్తపురాట వేశారు. ఈ పూజా కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఆయన సతీమణి రామలక్ష్మి పాల్గొని సీతారామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు మహిళలు ఆలయానికి చేరుకుని ముహూర్తపురాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈనెల17వతేదీన సాయిరామలింగేశ్వరాలయంలో శ్రీరామనవమి వేడుకలతో పాటు, సీతారాముని కల్యాణం, అన్నసమారాధన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు చర్యలు చేపడుతున్నారు.

కోష్టువలసలో సీతారాముల కల్యాణం

పాచిపెంట: మండలంలోని పణుకువలస పంచాయతీ కోష్టువలస గ్రామంలో సోమవారం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తుల రాకతో స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹230

ఆకట్టుకోని పురాణం అతకని అబద్ధం

- ఇదీ చీపురుపల్లి కూటమి అభ్యర్థి కళా వెంకటరావు ప్రచార తీరు
- నవ్వుకుంటున్న సొంత పార్టీ కేడర్, ద్వితీయ శ్రేణి నాయకులు



చీపురుపల్లి: అబద్ధం ఆడితే అతికినట్లు..పురాణం చెప్తే ఆకట్టుకునేలా ఉండాలంటారు. ఇదే తరహాలో ఎన్నికల ప్రచారంలో శతవిధాలా ప్రయత్నిస్తున్న చీపురుపల్లి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి టీడీపీకి చెందిన కళా వెంకటరావు తీరును చూస్తూ ఆయన చెబుతున్న అబద్ధాలు వింటూ సొంత పార్టీ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు నవ్వుకుంటున్నారు.

నోటికొచ్చిన అబద్ధం చెప్పడం ప్రజలను మోసం చేసి మభ్యపెట్టడం టీడీపీకి వెన్నతో పెట్టిన విద్య అనుకుంటారు అంతా. ఎందుకంటే సాక్షాత్తు ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడే పూటకో అబద్ధం, రోజుకో మోసం అనే చందాన తొలి నుంచి రాజకీయాలు చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. ఆయన్నే ఆదర్శంగా తీసుకుంటున్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఉన్న ఆ పార్టీ నేతలు మన బాస్ ఇష్టారాజ్యం అబద్ధాలు చెబుతున్నప్పుడు మనం చెప్తే ఏముందిలే అనుకుంటున్నారేమో గాని చంద్రబాబునే డిటోగా ఫాలో అయిపోతున్నారు. అందులో భాగంగానే చీపురుపల్లి కూటమి అభ్యర్థిగా కొత్తగా నియోజకవర్గానికి వచ్చిన కిమిడి కళా వెంకటరావు కూడా మద్యపాన నిషేధం, డ్వాక్రా రుణమాఫీ, తోటపల్లి సాగునీటి కాలువ కోసం అబద్ధాలే ప్రచార అస్త్రాలుగా ప్రతి రోజూ ప్రజలను మభ్యపెట్టే ప్రక్రియ ప్రారంభించారని స్థానికంగా చర్చ జరుగుతోంది. అసలు ఇక్కడి ప్రజలకు ఏమీ తెలియదన్నట్లు, రెండు దశాబ్దాల క్రితంలో మాదిరిగా ఏం చెప్పినా పర్లేదనుకుంటున్నారేమో గానీ మరీ అబద్ధాలు చెప్పేస్తున్నారని సొంత పార్టీ కార్యకర్తలే చెవులు కొరుక్కుంటున్నట్లు తెలుస్తోంది. రాజకీయంగా ఎంతో విజ్ఞత కలిగిన ఓటర్లు ఉన్న చీపురుపల్లిలో ఇలాంటి పుక్కిటి పురాణాలు ఎవరూ నమ్మరని టీడీపీ శ్రేణులు చర్చించుకుంటున్నట్లు సమాచారం.

మద్యపాన నిషేధం ఎత్తేసి, మంచి లిక్కర్ ఇస్తామంటూ..

పేదలకు మద్యం దూరం చేయాలన్న లక్ష్యంతో టీడీపీ వ్యవస్థాపకుడు స్వర్గీయ ఎన్టీ రామారావు మద్యపాన నిషేధం విధించారు. ఆ తరువాత ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి టీడీపీని లాక్కుని ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు మద్యపాన నిషేధాన్ని ఎత్తివేసిన సంగతి అందరికీ గుర్తుంది. మూడు శాబ్దాల క్రితం నుంచి మద్యం తాగించి పేదల ప్రాణాలు తోడేస్తున్నది చంద్రబాబేనని మద్యపాన నిషేధం కోసం మాట్లాడే అర్హత బాబుకు ఎక్కడుందంటూ చర్చ జరుగుతోంది. అంతేకాకుండా మరొకడుగు ముందుకేసి గత కొంతకాలంగా నాణ్యమైన లిక్కర్ ఇస్తానని చంద్రబాబు బహిరంగ సభల్లో ప్రకటిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. మద్యంలో కూడా మంచి, చెడు రకాలు ఉన్నాయా అంటూ కొత్త అర్థాన్ని తీసుకొచ్చిన చంద్రబాబు మరోవైపు మద్యపాన నిషేధం కోసం మాట్లాడుతుండడం, ఆ విషయాన్ని ఇక్కడ కళా వెంకటరావు ప్రజలపై రుద్దేందుకు చేస్తున్న కృషి చూస్తుంటే విడ్డూరంగా ఉందని అంతా అనుకుంటున్నారు.

వైఎస్సార్ హయాంలోనే తోటపల్లి సాకారం..

తోటపల్లి కోసం టీడీపీ నేతలు చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే హాస్యాస్పదంగా ఉన్నాయనే చర్చ జరుగుతోంది. తోటపల్లి ప్రాజెక్టు కోసం కేటాయించిన నిధులను చంద్రబాబు పక్కదోవ పట్టించి ప్రాజెక్టు పనులు నిలిపివేశారు. అదే 2004లో అధికారంలోకి వచ్చిన దివంగత మహానేత వైఎస్సార్ రూ.400 కోట్లు నిధులు కేటాయించి పనులు ప్రారంభించిన విషయాన్ని టీడీపీ నేతలు గుర్తు చేసుకోవాలని రైతులు అంటున్నారు. 2009లో మహానేత మరణ సమయానికి 90 శాతం పనులు కూడా పూర్తయిన సంగతి అందరికీ తెలిసిందే.

మహిళలను మోసం చేసింది చంద్రబాబు..

మహిళలను జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేశాడని టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్న నేపథ్యంలో మహిళలను మోసం చేసింది చంద్రబాబు కదా అంటూ నవ్వుకుంటున్నారు. 2014 ఎన్నికల ముందు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని, అప్పులు తీర్చొద్దని మహిళలకు మాట ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక రుణమాఫీ ఊసెత్తని చంద్రబాబు మహిళలను మోసం చేశాడు. అదే 2019 ఎన్నికల ముందు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగు విడతల్లో మహిళల రుణాలను పూర్తిస్థాయిలో వారి ఖాతాల్లోనే జమ చేసిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

సొసైటీ భూముల పేరిట రాజకీయం సిగ్గుచేటు

- కొళ్ల గౌరీశంకర్ ఆరోపణలు అర్థరహితం
- ఆ భూములతో ఎమ్మెల్యేకు సంబంధం లేదు
- సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు

విజయనగరం: నగరంలోని డబుల్‌కాలనీని ఆనుకుని ఉన్న 18 ఎకరాల భూమి సొసైటీ సభ్యులదేనని, ఈ విషయంలో అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కొళ్ల గౌరీశంకర్ తన రాజకీయ ఉనికిని చాటుకునేందుకు ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిపై చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆ స్థలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సొసైటీ ప్రతినిధులు గ్రంధి రాజశేఖర్, గండ్రేటి సన్యాసిరావు మాట్లాడారు. సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్‌గా ఏర్పాటై 18 ఎకరాల స్థలాన్ని తామంతా కలిగి ఉన్నామన్నారు. సర్వే నంబర్ 209లోని 1ఎ/2 పరిధిలో గల 18 ఎకరాల భూమిపై సంపూర్ణ హక్కులు తమ సొసైటీకి సంబంధించిన అంశాలేనని చెప్పారు. అందుకు సంబంధించిన అన్ని ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయమై ఇటీవల కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కొళ్ల గౌరీ శంకర్ మీడియా సమావేశాలు పెట్టి స్థానిక శాసనసభ్యుడు ఆక్రమించుకున్నారంటూ ఆపాదించే ప్రయత్నం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సదరు సొసైటీలో ఇబ్బందులను తెలియపరచడానికి స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి వద్దకు పలు మార్లు సొసైటీ సభ్యులంతా వెళ్లి కలిశామని చెప్పారు. ఈ విషయాన్ని వక్రీకరిస్తూ సదరు భూమి విషయమై ఎమ్మెల్యే కోలగట్లకు ఆపాదిస్తూ లేనిపోని ఆరోపణలు గౌరీశంకర్ చేస్తున్నారన్నారు.

అనవసర ఆరోపణలపై కోర్టుకు వెళ్తాం

ఈ భూమి విషయమై ఎటువంటి ప్రస్తావనైనా తమతో మాత్రమే చేయాలని, స్థలంతో సంబంధం లేని ఎమ్మెల్యే లాంటి వ్యక్తులను ఎన్నికల సమయంలో ప్రస్తావించడం గౌరీశంకర్‌కు సరికాదని హితవు పలికారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్న గౌరీశంకర్ లాంటి వ్యక్తులను కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ప్రోత్సహించవద్దని కోరుతున్నామన్నారు. గౌరీశంకర్ చేస్తున్న ఆరోపణలను తాము ఖండిస్తున్నామని ఇటువంటి ప్రస్తావనలు కొనసాగిస్తే న్యాయపరంగా ముందుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ రెడ్డి, కె.హరి ప్రసాద్ రావు, సభ్యులు జి.గోవిందరావు ఆర్.కె.బాషా, కె.సుధాకర్ రావు, కుమార్, ఆర్. శ్రీనివాసరావు, ఎ.సరోజ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి ప్రవేశాలు



జోగింపేట విద్యాలయంలో మాట్లాడుతున్న సమన్వయకర్త టి.పద్మజ

సీతానగరం: ఉమ్మడి విజయనగరం జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5 వ తరగతిలో ప్రవేశాలకు ఎంపిక చేసిన మొదటి లిస్ట్‌లో సీట్లు దక్కనివారికి, ఇంకా మిగిలి ఉన్న సీట్ల భర్తీకి బాలురకు గురువారం కొప్పెర్ల గురుకుల పాఠశాలలో, బాలికలకు శుక్రవారం చీపురుపల్లిలో ఎంపిక జరుగుతుందని జిల్లా సమన్వయకర్త టి.పద్మజ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని జోగింపేట డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఎంపిక ప్రక్రియ ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ జరుగుతుందని ఆమె తెలియజేశారు. మెరిట్ లిస్ట్ జాబితాలో ఉన్న విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని, మొబైల్ ఫోన్ నంబర్లకు ఫోన్ చేసిలేదా మెసేజ్ రూపంలో సమాచారం ఇవ్వనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకే ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాల కోసం బాలికలు ఫోన్ 83330-33434నంబర్‌కు, బాలురు ఫోన్ 63038-38657 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో జోగింపేట సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

కూచిపూడి కళాకారులకు సత్కారం



బొబ్బిలి వీణలతో కళాకారులు

విజయనగరం అర్బన్: భగవతి నృత్య కళామందిర్ ఆధ్వర్యంలో ఈ నెల 23న 12 గంటల పాటు నిర్విరామంగా కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించనున్న కళాకారులకు స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఘనంగా సత్కారించారు. ఈ సందర్భంగా కళాకారులకు బొబ్బిలి వీణలు బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్‌నాయుడు, చెలపాక వెంకటలక్ష్మి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా సర్వే నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ పగడాలమ్మ

- డీఈఓ పగడాలమ్మ

పార్వతీపురంటౌన్: స్టేట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే -2024ను సమర్థవంతంగా నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం బాలికల పాఠశాలలో జరుగుతున్న ఫీల్డ్ ఇన్విజిలేటర్ల శిక్షణ (ఎస్‌ఎల్‌ఏఎస్)ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మంగళవారం స్టేట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 128 పాఠశాలల్లో 13,646 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఈ సర్వే ఉదయం 9గంటల నుంచి 10.30 గంటల వరకు, 10.45 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఈ సర్వేకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, డీఈఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంల తరలింపు పరిశీలించిన కలెక్టర్



ఈవీఎంలు రవాణా చేస్తున్న వాహనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం టౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల తరలింపును కలెక్టర్ నిషాంత్ కుమార్ సోమవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఈవీఎంలు భద్రపరిచిన గొడౌన్ నుంచి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వాహనంలో ఈవీఎంలను తరలించారు. ఇప్పటికే తొలి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని, జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, పార్లమెంట్ నియోజకవర్గం ఈవీఎం, వీవీప్యాట్‌లపై నియోజకవర్గంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఈ సందర్భంగా తెలిపారు. స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు అందరూ సహకారం అందించాలని కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి. కేశవనాయుడు, తహసీల్దార్ కె.ఆనందరావు, ఆర్‌ఐ రామకృష్ణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

18 ఏళ్ల లోపు బాలలను రాజకీయ పనులకు వినియోగించరాదు



కార్మికశాఖ సహాయ కమిషనర్ కె.రామకృష్ణారావు

పార్వతీపురం టౌన్: రాజకీయ పార్టీలవారు సార్వత్రిక ఎన్నికల కార్యక్రమాల్లో గానీ, ప్రచార పనులకు గానీ 18 ఏళ్ల లోపు బాలలను వినియోగించరాదని కార్మికశాఖ సహాయ కమిషనర్ కె.రామకృష్ణారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బాలలను రాజకీయ కార్యకలాపాలకు వినియోగించుకున్నట్లయితే బాల కార్మిక నిషేధ చట్టం ప్రకారం 6 నెలల జైలు శిక్ష, రూ.50 వేల వరకు జరిమానాకు బాధ్యులవుతారని హెచ్చరించారు. కార్మిక శాఖ కమిషనర్ ఆదేశాల ప్రకారం ఇంటర్ స్టేట్ మైగ్రేట్స్ లేబర్ (ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు) ను ముఖ్యంగా ఇటుక బట్టీల్లో పనిచేసే అంతర్‌రాష్ట్ర వలస కార్మికులను వారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు వారి సొంత రాష్ట్రంలోని స్వగ్రామాలకు తప్పనిసరిగా పంపించాలని స్పష్టం చేశారు. అలా పంపించని యజమానులపై చట్టరీత్యాచర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

బంగారు శతమానం బహూకరణ

విజయనగరం: పట్టణంలోని చిక్కాలవీధిలో ఉన్న సీతారామచంద్ర ఆలయంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సతీమణి కోలగట్ల వెంకటరమణి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం దగ్గరుండి స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీరామనవమి సందర్భంగా సీతారామచంద్ర స్వామివారికి బంగారు శతమానం, పుష్పఫలాదులను ఆమె సమర్పించారు. శ్రీరాముని ఆశీస్సులు ప్రతీ ఒక్కరిపైనా ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు.

బైబై బాబూ..!

- కొప్పరలో 40 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వంగర: కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్



వలంటీర్లకు కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

వంగర: మండల పరిధి కొప్పరలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి 40 కుటుంబాలు చేరాయి. ఈ మేరకు కొప్పర ఎంపీటీసీ కిమిడి సన్యాసినాయుడు (తాతబాబు) ఆధ్వర్యంలో రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ సోమవారం వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన కోట ఆదియ్య, కోట పోలిరాజు, బొడ్డాన వెంకటి, బొడ్డాన అప్పలస్వామి, కోరాడ రమణ, కోరాడ జగది, బొడ్డాన భూషణతోపాటు మరికొంత మంది పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా తలే రాజేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారని, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గర్భాపు నారాయుడు, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేషుముఖర్జీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, ఉత్తరావెల్లి గణేష్‌బెనర్జీ, బొంతు వెంకటరావు, వేమిరెడ్డి సూర్యనారాయణ, కిమిడి చిట్టిబాబు, పారిశర్ల రామకృష్ణ, నెయిగాపుల శివరామకృష్ణయ్య, యలకల వాసునాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన వలంటీర్లు

పార్వతీపురంటౌన్: తమ ఊపిరి ఉన్నంతవరకు వైఎస్సార్‌సీపీతోనే ఉంటామని పార్వతీపురం పట్టణానికి చెందిన 23, 24 వార్డు వలంటీర్లు అన్నారు. ఈ మేరకు సోమవారం 20 మంది వలంటీర్లు రాజీనామా చేసి ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లుగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించామని, తమ సేవలను అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు ఇబ్బందులకు గురిచేసి అవ్వాతాతలకు పింఛన్ మాతో అందించే సేవలకు దూరం చేయడం బాధాకరమన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి పేదల ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, అందుకే ఆయన వెంటే ఉంటామన్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే జోగారావును మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఎంతమంది ఏకమైనా ఏమీ చేయలేరు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: అధికారం కోసం మామను మింగేసిన నీచుడు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఎన్ని కుట్రలకైనా తెగబడతాడని చెప్పడానికి తార్కాణం సీఎం జగన్‌మోహన్ రెడ్డిపై విజయవాడలో జరిగిన రాయిదాడి అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఎన్ని దుష్టశక్తులు ఏకమైనా ప్రజలు ఆశీస్సులు, అండదండలు ఉన్న జగన్‌మోహన్ రెడ్డిని ఎవరూ ఏమీ చేయలేరని, సీఎంకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ఇటువంటి కుట్రలకు తెగబడుతున్నారన్నారు. గులకరాయి తగిలితే ప్రాణాలు పోతాయా? అని అడుగుతున్న ప్రతిపక్ష నేతలు తగిన మూల్యం చెల్లించక తప్పదని స్పష్టం చేశారు. ఈ తరహా కుట్రలకు పాల్పడుతున్న కూటమి నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తారని ధీమా వ్యక్తం చేశారు.

ప్రతిపక్షాలదే దాడి బాధ్యత

వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ విజయవాడలో జగన్‌మోహన్ రెడ్డిపై జరిగిన దాడికి టీడీపీ, జనసేనలే జవాబుదారీ అని అన్నారు. ప్రతిపక్షాలే దీనికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు తన సభల్లో జగన్ మోహన్ రెడ్డిని ఏది దొరికితే దాంతో కొట్టండంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈనెల 19న ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థిగా కడుబండి శ్రీనివాసరావు నామినేషన్ ప్రక్రియకు ప్రతి కార్యకర్త హాజరుకావాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే హైమావతి, నియోజకవర్గ పరిశీలకుడు తైనాల విజయ్‌కుమార్, జేసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వి.రాంబాబు, మోపాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర సేవల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: అత్యవసర సేవలందిస్తున్న శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఎన్నికల విధుల్లో పాల్గొంటూ పాస్‌లు పొందిన మీడియా వారికి ఓటింగ్ కోసం పోస్టల్ బ్యాలెట్‌ను అందించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అత్యవసర సేవలను అందించే అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ 33 శాఖలను అత్యవసర శాఖలుగా గుర్తించి వారికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలని నోటిఫై చేసినట్లు తెలిపారు. వారంతా పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం 12 డి ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ రైల్వే, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, ఎలక్ట్రిసిటీ, హెల్త్ అండ్ ఫామిలీ వెల్ఫేర్, స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్, ఫుడ్ అండ్ సివిల్ సప్లైస్, బీఎస్ఎన్ఎల్, పోలింగ్ రోజున ప్రెస్ కవరేజ్ చేయడానికి ఎన్నికల కమిషన్ జారీ చేసిన అథారిటీ లెటర్స్ కలిగి ఉన్న పాత్రికేయులు, ఫైర్ సేవలు అందిస్తున్న వారికీ పోస్టల్ బ్యాలెట్ వర్తిస్తుందన్నారు. ఆయా శాఖల అధికారులు పోస్టల్ బ్యాలెట్ కోసం సిబ్బంది వివరాలను మంగళవారం లోగా అందజేయాలని, వారందరికీ ఫారం 12 డి అందజేస్తామని తెలిపారు. ఈ ఫారాలను సమర్పించడానికి ఈ నెల 22 ఆఖరు తేదీగా తెలియజేశారు. ఫారం డి నింపిన తర్వాత ఆయా శాఖల అధికారులు సర్టిఫై చేసి అందజేస్తే మే 8, 9, 10లో ఓటు చేయవలసి ఉంటుందని తెలిపారు. ఒకసారి ఫారం డి తీసుకున్న వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తప్పిస్తే పోలింగ్‌స్టేషన్‌లో ఓటు వేసే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, అత్యవసర శాఖల అధికారులు పాల్గొన్నారు.